# ఇంటికి బిడ్డా - కంటిలో నలుసు

## పునర్వసు




**ప**ట్టు వదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్ళి, చెట్టు నుంచి శవాన్ని దించి భుజంపై వేసుకుని ఎప్పటిలాగే నడవసాగాడు. అతని పట్టుదలని చూసిన భేతాళుడికి విక్రమార్కుడు ఓ వెర్రివాడిలా కనబడ్డాడు. వీపు గూని వచ్చినా సరే కేజీల కొద్దీ బరువును మోస్తూ బళ్ళకు వెళ్తున్న చిన్నారుల కష్టం ముందు విక్రమార్కుని కష్టం ఏమీ లేదని అనిపించింది. ఇద్దరూ ఒకేలా కష్టపడుతున్నారు పిచ్చివాళ్ళు, అనుకుని కిసుక్కున నవ్వాడు.

వదిలితే మళ్ళీ ఎక్కడ చెట్టు ఎక్కుతాడోనన్న భయంతో భేతాళుడిని మోస్తున్న విక్రమార్కుడికి, భేతాళుడు నవ్వింది వినబడలేదు. అది గమనించిన భేతాళుడు ఇలా అన్నాడు- "రాజా విక్రమార్కా! నీ సహనానికి, దీక్షకు నా జోహార్లు. నిన్ను చూస్తూ వుంటే కాన్వెంట్ పిల్లలు గుర్తుకొస్తున్నారు. పాపం! వాళ్ళు నీలాగే బరువు మోస్తున్నారులే, ఆ బరువులు మోస్తున్న చిన్నారుల కోసం, వాళ్ళ తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారో, ఎంత అవస్థపడుతున్నారో, చెబుతాను విను. అది వింటూ వుండు నీకు మార్గాయాసం వుండదు" అంటూ మొదలు పెట్టాడు.

విక్రమార్కుడికి కుతూహలం వేసింది. 'సరే'నన్నాడు. భేతాళుడు మొదలుపెట్టాడు. "ఇది సామాన్య కుటుంబీకుడి కథ. ప్రేమించి, పెద్దల అంగీకారం కోసం వేచి, వాళ్ళు ఒప్పుకోకపోవడం వల్ల ఇల్లు వాకిలి వదలి పెళ్ళి చేసుకున్నాడు.

కొత్తగా పెళ్ళై సంవత్సరం కాకుండానే మిలీనియమ్ బేబి వస్తుందన్న సంతోషం కంటే పుట్టబోయే బిడ్డకు ఏ స్కూల్‌లో అడ్మిషన్ దొరుకుతుందా అని చింతించసాగారా దంపతులు మధు, రేవతిలు.

నెలలు నిండే కొద్దీ వాళ్ళలో టెన్షన్ పెరుగుతూ వచ్చింది. భార్యకు తొమ్మిదో నెల రాగానే, మధు ఎక్కని స్కూల్ గుమ్మం లేదు. దిగని స్కూల్ గుమ్మం లేదు. ఎక్కడికి వెళ్ళినా ఖాళీ లేదన్న సమాధానం. గవర్నమెంట్ స్కూల్లో చేరుద్దామంటే నామోషి. తన కొలీగ్ పిల్లలంతా మంచి మంచి స్కూళ్ళలో, డొనేషన్ ఇచ్చి మరీ చేర్పించారు. వాళ్ళ చదువుల కోసం, ఓ.టిలు గీటీలు కూడా చేశారు, చేస్తున్నారు కూడా! అలాంటప్పుడు తను పుట్టబోయే బిడ్డను మంచి స్కూల్లో చేర్పించకపోతే వాళ్ళ ముందు తన ప్రెస్టేజ్ ఏం కావాలి? తనకు ఉన్నా లేకపోయినా, కష్టపడైనా సరే. మంచి స్కూల్‌లో చేర్పించాలని భార్యాభర్తలు నిర్ణయించు కున్నారు. కానీ, ఎక్కడా సీటు దొరకందే! చివరకు తన ఫ్రెండ్స్ కాళ్ళావేళ్ళా పడి అతి ప్రయాసంతో ప్రెస్టేజ్ అన్న పేరున్న స్కూల్లో లంచం ఇచ్చి అడ్మిషన్ ఫాం తెచ్చాడు. ఆ తేవడం తెచ్చాడు గానీ ఏం బిడ్డో ఎవరికి తెలుసు? భార్యను తీసుకెళ్ళి స్కానింగ్ చేయించాడు. అక్కడ కూడా స్కానింగ్ రిపోర్ట్ ఇవ్వడానికి నిరాకరించింది. ఆమెను బ్రతిమలాడి, అంతో ఇంతో సమర్పించుకున్నాక ఆమె అతనికి ఇచ్చి, తన పేరు చెప్పకుండా జాగ్రత్తపడమని ఓ సలహా ఇచ్చింది.

ఓ మంచి రోజు చూసి అప్లికేషన్ ఫిలప్ చేశాడు. సెక్సు వద్దకు వచ్చేసరికి 'మొగపిల్లవాడని'

రాశాడు. అంతా బాగుంది! కానీ పేరు వద్దకు వచ్చేసరికి తికమకపడ్డారు. ఏం పేరు పెట్టాలో తెలియలేదు. ఇద్దరి మధ్యా వాగ్వివాదాలు, తర్జనభర్జనలు జరిగిన ఆ 'కాలం' ఖాళీగానే వుంచారు. ఇద్దరూ కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు.

ఇద్దరూ మర్నాడు స్కూల్ ప్రిన్సిపాల్ వద్దకు వచ్చారు. అప్లికేషన్ ఇచ్చారు. ఆయన అంతా పరిశీలించి 'క్యాండిడేట్' వద్ద ఖాళీగా వుండడం చూసి "ఇదేంటి? ఇక్కడ ఖాళీగా వుంది?" అని అడిగాడు.

అందుకు మధు "మరే! నాకు నచ్చిన పేరు, మా ఆవిడకు నచ్చలేదు. ఆవిడకు నచ్చిన పేరు నాకు నచ్చలేదు. ఎంతైనా పెద్దలు మీరు. అదీగాక మూడున్నర సంవత్సరాల నుంచి మీ స్కూల్లో జాయిన్ అవుతున్నాడు. ఎలాగూ సీటు ఇచ్చారు. పేరు కూడా పెడితే మిమ్మల్ని రోజూ తలుచుకుని దీపం పెట్టుకుంటాము" అన్నాడు.

"అవును! అబ్బాయే పుడతాడని గ్యారెంటీ ఏమిటి?" అని ప్రశ్నించాడు ప్రిన్సిపాల్.

"స్కానింగ్ చేయించామండీ!" అన్నాడు మధు.

"ఏది రిపోర్ట్ వుందా? ఎందుకంటే ఒకవేళ ట్విన్స్ పుడితే మరి మూడేళ్ళ దాకా ఆగాలి. ఎందుకంటే ఇప్పుడున్న పరిస్థితులలో ఇంటికో బిడ్డకు మాత్రమే సీటు ఇస్తున్నాం" అన్నాడు.

"ఇదెక్కడి గోల బాబూ? మేమే పిల్లవాడు పుట్టకముందే ఇంత ఇదిగా వున్నాము. మా కంటే ఎక్కువగా ఆలోచిస్తూ వున్నాడు ఆయన. ఖర్మ! తప్పుతుందా!" అని మనసులో అనుకుని పైకి మాత్రం "లేదు సార్! స్కానింగ్ రిపోర్టు వుంది" అంటూ రిపోర్టు అందించాడు.

దాన్ని అప్లికేషన్‌తో జత చేస్తూ మధు వైపు చూసి "ఓ ఐదు వందలు ఇలా పడెయ్యండి" అన్నాడు.

"ఐదు వందలా? ఎందుకూ?" అడిగాడు మధు ఆశ్చర్యంగా నోరు తెరచి.

"ఎందుకంటారేంటండీ! మీరే కనుక నామకరణం, జాతక కరణం, అవీ ఇవీ అంటూ ఎంత ఖర్చు చేస్తారు? అదీకాక మొదటి సంతానం అవునా?"

"నిజమే! దాదాపు రెండు వేలు."

"మరి! ఆఫ్ట్రాల్ నేను ఐదువందలు అడిగితే, ఇవ్వడానికి వెనకాడుతున్నారేమిటి? ఇక మా స్కూల్లో ఎలా చదివించగలరు?"

ఈ సీట్ పోతే మళ్ళీ తను ఎన్నాళ్ళు వెతుక్కోవాలి? ఖర్మ...ఖర్మ...ఏం చేస్తాము? గోతిలో దిగాక తప్పుతుందా?



ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పిల్లల పద్యపఠన పోటీలో ప్రథమ బహుమతి పొందిన చి॥కందుకూరి పూజితకి బహుమతిని అందచేస్తున్న ఫోర్ఫీటెడ్ ప్రాపర్టీ అప్పీలైట్ ట్రిబ్యునల్ ఛైర్మన్ జె.ఈశ్వర్ ప్రసాద్, సంస్థ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ, ఢిల్లీ పోలీసు జాయింట్ కమీషనర్ యు.ఎన్.బి.రావు, సంస్థ అధ్యక్షులు డా.కె.జి.రావుగార్లని చిత్రంలో చూడవచ్చు.

"ఊఁ! తీసుకోండి!" అంటూ ఐదు వందల కాగితం ఇచ్చాడు.

ఆ నోటు తీసుకుని అటు ఇటు తిప్పి పరిశీలించి "దొంగ నోటు కాదుగా?" అని అడిగాడు.

మధు మొఖంలో రక్తం చిమ్మింది. "ఛీ! ఛీ! తన గురించి ఏమనుకుంటున్నాడు ఈయన. తను అంత దిగజారిపోయే మనిషా?" మొహం గంటులా పెట్టుకుని "ఆఁ అది ఖచ్చితంగా ఆర్.బి.ఐ నోటే లెండి. నిక్షేపంగా తీసుకోవచ్చు" అన్నాడు కోపంగా.

అది ఏమాత్రం పట్టించుకోకుండా "అలా కోప్పడకండి సార్! ఇలాంటి నోటు ఓ సారి వచ్చి మా కొంప ముంచింది.అప్పటి నుంచి జాగ్రత్తగా వుంటున్నాను."

విక్రమార్కుడు అడ్డు పడ్డాడు. "దొంగ నోటు అంటే ఏమిటి?" అని అడిగాడు భేతాళుడిని.

"అది చెల్లని నోటు. ప్రభుత్వం అచ్చువేసే నోటు కాదు. కొంత మంది పెద్దలు, స్వయాన అచ్చువేసి ఇలా చెలామణి చేస్తారులే!" అన్నాడు భేతాళుడు.

"మరి ప్రభుత్వం వూరుకుంటుందా?"

"పిచ్చిరాజా! ఇది ప్రజాస్వామ్యం. నీ రాజుల కాలం కాదు. పట్టుబడితే దొంగ, పడకపోతే రాజు! అయినా వాళ్ళ వెనక పెద్ద పెద్ద రాజకీయనాయకులు వుంటారులే! వాళ్ళ అభయ హస్తం, వీళ్ళకు అండ. అయినా అదంతా నీకు అర్థం కాదులే! ముందు కథ విను!" అంటూ తిరిగి ప్రారంభించాడు.

ఆ ప్రిన్సిపాల్ ఆ అబ్బాయికి "విక్రమ్" అని నామకరణం చేశాడు.

"విక్రమా! అయితే అది నా పేరన్నమాట! నన్ను ఇంకా తలుచుకుంటూ వున్నారన్నమాట" అన్నాడు విక్రమార్కుడు సంతోషంగా.

"ఆఁ! ఆఁ! అంత సంతోషపడకు. నీ పేరు పెట్టింది అందుకు కాదు. నీవు నన్ను మోస్తున్నావు కదా! అలాగే ఆ పిల్లవాడు స్కూల్లో చేరిన దగ్గర నుంచి బుక్స్ మోయాలి. అందుకని! అయినా ఇప్పుడు టీ.వీ.లలో మన కథలు వస్తున్నాయి కదా! ఇక మర్చిపోయే ప్రసక్తి లేదు. పూర్తిగా విను" అంటూ కథ ముందుకు సాగించాడు.

"అదే ఖాయం చేశారా తల్లిదండ్రులు. సరేనని ఆ పేరే రాయించారు అప్లికేషన్‌లో.

"పిల్లవాడు పుట్టగానే ఆరు నెలలకోసారి వచ్చి కలుసుకోండి. ఎందుకంటే ఇంతమంది అప్లికేషన్లలో మర్చిపోకుండా వుండాలిగా!" అన్నాడు ప్రిన్సిపాల్.

'సరే'నని గంగిరెద్దులా తలూపి ఇంటికి వచ్చారు వారిద్దరూ.

ఓ శుభముహూర్తాన వాళ్ళకు మొగపిల్లవాడే

పుట్టాడు. నామకరణం అన్నీ అయ్యాయి. ప్రతి ఆరు నెలలకోసారి వచ్చి ప్రిన్సిపాల్ దర్శనం చేయించుకుని వెళ్ళేవాడు.

"పిల్లవాడిని స్కూల్లో వేసేముందు కాస్త అబ్బాయికి, రైమ్స్ ఒంట్లు, ఎ.బి.సి.డీలు నేర్పించండి! ఎందుకైనా మంచిది!" అన్నాడు ప్రిన్సిపాల్.

అదే ప్రకారం రేవతి అన్నీ నేర్పించింది. పాపం పసివాడికి నోరు తిరక్క అవస్థ పడేవాడు. హాయిగా ఆటలు ఆడుకోకుండా, ఇదేమీ సంత అని రేవతి మనస్సు ఉసూరుమంది. కానీ తప్పదు. బురదలో దిగాక బురద అంటే ఎలా?

మొత్తానికి మూడున్నర సంవత్సరాలు వచ్చాయి. మంచి రోజు చూసి స్కూల్లో చేర్పించడానికి వెళ్ళారు. ప్రిన్సిపాల్ వాళ్ళను చూడగానే సంతోషంగా ఆహ్వానించి కూర్చోబెట్టాడు.

"బాబు ముద్దొస్తున్నాడు" అన్నాడు మెచ్చుకోలుగా. దంపతుల మొహం సంతోషంతో వెలిగిపోయింది.

బెల్ నొక్కి ఆయాను పిలిపించి "ఈ అబ్బాయిని కె.జి క్లాసుకు తీసుకెళ్ళు" అని చెప్పి ఆయాతో బాబును పంపించి వీళ్ళవైపు తిరిగి సొరుగు లాగి ఓ కాగితం ఇచ్చాడు.

మధు ఆ కాగితం చూడగానే ఎక్కడ కళ్ళు తిరిగి పడిపోతానోనన్న భయంతో కుర్చీని గట్టిగా పట్టుకున్నాడు. ప్రిన్సిపాల్ ఇదంతా మామూలే అన్నట్లు చిద్విలాసంగా నవ్వుతున్నాడు.

"చూడండి సార్! టెస్టు బుక్స్, పుస్తకాలు, యూనిఫారం, బూట్లు, సాక్సు, కలర్ పెన్సిళ్ళు, మామూలు పెన్సిళ్ళు, వ్యాన్ అన్నీ అంటే సమస్తం ఇక్కడే సప్లయ్ చేస్తాము. ఎందుకంటే పేరెంట్స్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు. మీరు ఒక్కొక్క బుక్ కోసం అంగళ్ళు వెతికే లోపల ఆరు నెలలు కావచ్చు. లేదా ఏడాది కావచ్చు. మీకు టైం వేస్టు కాకుండా ఈ పద్ధతి.....సో! డబ్బు కట్టి అన్నీ తీసుకెళ్ళవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇక్కడ ఎ టు జడ్ దాకా అన్నీ దొరుకుతాయి. ఎంతైనా మాది ప్రెస్టేజ్ స్కూల్ కదా!" అన్నాడు.

"అయినా మూడు వేలా?" అని అడగకుండా వుండలేకపోయాడు మధు.

"మరి చెప్పానుగా, మా స్కూల్ ప్రెస్టేజ్ అని. అంటే ఇక్కడ అన్నీ హైక్లాస్‌లో వుంటాయి."

నీ బొంద ప్రెస్టేజ్ పేరుతో పేరెంట్స్‌ను దోచుకొని ఇలా మేడలపై మేడలు కడుతున్నావురా! విధిలేక మేము ఒప్పుకోవలసిందే! అనుకున్నాడు కసిగా.

చచ్చి చెడి మూడు వేలు ఇచ్చి, పుస్తకాలను ఇంటికి తెచ్చారు భార్యాభర్తలు. ఆ పుస్తకాల నోటు బుక్కులు చూసేసరికి కళ్ళు తిరిగాయి ఇద్దరికీ. అయినా ఎల్.కె.జీకి ఇన్ని పుస్తకాలా? ఆ చిన్నారి తలలో ఇవి ఎక్కుతాయా? అసలు ఈ బరువు ఎలా మోయగలడు? ఊ! ఏం చేస్తాం? రోట్లో తల దూర్చినాక రోకలికి భయపడడం ఎందుకు? అనుకున్నారు.

అలా ప్రారంభమైన జీవితం ప్రతి నెలా, ఏదో ఒకటి చెప్పి ఐదు వందలకు తక్కువగా, అప్పు చెయ్యక తప్పలేదు మధుకు. అప్పు ప్లస్ వడ్డీ పెరుగుతూనే వచ్చింది. సంవత్సరం తిరిగిన తరువాత వాళ్ళు ఓ నిర్ణయానికి వచ్చారు!" అంటూ కాసేపు ఆపి "విక్రమార్కా! ఇప్పుడు చెప్పు ! ఆ తల్లిదండ్రులు ఏం నిర్ణయం తీసుకొని వుంటారు? తెలిసి చెప్పకపోతే వచ్చేజన్మలో నీవూ ఈ అబ్బాయిలాగా పుట్టి, నన్ను ఆ పుస్తకాల రూపంలో మోస్తావు..." అన్నాడు భేతాళుడు.

విక్రమార్కుడు భేతాళుడితో కంగారుగా "భేతాళా! అంత పని చెయ్యకు. జవాబు చెబుతాను. నిన్ను మోయగలను. కానీ ఆ బరువు మొయ్యలేను" అన్నాడు.

"చెప్పు మరి!"

"భేతాళా! విను ఏముంది! ఒక్క పిల్లవాడికే ఇలా వేలు వేలు అప్పు చేస్తున్నాం కదా! మరో పిల్లాడు కలిగితే వాడి గతి ఏమిటి? అందుకు ప్రభుత్వం చెప్పినట్లు "ఇంటికి బిడ్డా, కంటిలో నలుసు" అన్నట్లుగా ఒక బిడ్డ చాలని నిర్ణయించుకున్నారు" అని అన్నాడు విక్రమార్కుడు.

"కరెక్ట్! విక్రమా! ఇక కథ కంచికి, నేను చెట్టు పైకి..." అంటూ రివ్వున ఎగిరిపోయాడు భేతాళుడు.

"భేతాళా...!" అంటూ విక్రమార్కుడు భేతాళుడి వెంటపడ్డాడు.

❋

## ఆకాష్‌కు మరో ఛాన్స్

హీరో ఆకాష్‌కు 'ఆనందం' చిత్రం తప్ప మరే చిత్రం ఆనందాన్ని మిగల్చలేదు. అతను కూడా వ్యక్తిగతంగా నిర్మాతలకు విషాదాన్ని మిగుల్చుతాడనే పేరు ఇండస్ట్రీలో ఉంది. ఆకాష్‌కు హీరోగా మంచి ఇమేజ్ లేదు. అలాగే... పరిశ్రమలోనూ ఆయన ప్రొఫెషనలిజమ్ లేని వ్యక్తి అని పేరుంది. అలాంటి ఆకాష్ ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తున్నాడు. ఒక చిత్రం తమిళంలో, మరొకటి తెలుగులో. ఈ చిత్రాలు తనను హీరోగా నిలబెడతాయని ఆకాష్ ఆశిస్తున్నాడు.



